# బఠాణి

బఠాణిలో విటమిన్-బి, సి మరియు కె పుష్కలంగా ఉండును. ఇందులో ఇనుము, క్యాల్షియం, జింక్, రాగి మరియు మాంగనీస్ వంటి ఖనిజ లవణాలు ఉండును. ఇవి రోగనిరోధక శక్తిని పెంచును, ఎముకలకు మరియు చర్మానికి మంచిది

**పంటకాలం:** శీతాకాలంలో రబీ పంటగా పండిస్తారు.

**వాతావరణం:** చలికాలం ఉష్ణోగ్రత $10-17^0$ సెం. వుండే పరిస్థితులు ఈ పంటకు అనుకూలం. వేడిగా, పొడిగా వుండే వాతావరణం అనుకూలం కాదు.

**నేలలు:** సారవంతమైన, నీరు బాగా ఇంకే నేలలు శ్రేష్ఠం. చౌడు భూములు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలం. ఉదజని సూచిక 6.0-7.5 మధ్య వున్న నేలలు అనుకూలం.

**రకాలు:**

**స్వల్పకాలిక రకాలు:**

**ఎర్లీబాడ్జర్:** ముడతలు గల గింజలతో కూడిన పొట్టిరకం. 55 నుండి 60 రోజులలో కోతకు వస్తుంది.

**అర్కెల్:** ముడతలు గల గింజలతో కూడిన అధిక దిగుబడినిచ్చే పొట్టి రకం. 60 రోజులలో ఆకుపచ్చని కాయలతో కోతకు వస్తుంది.

**మీటియర్:** ఋతువులో ముందుగా వేయుటకు అనుకూలమైన రకం. విత్తనాలు నునుపుగా వుంటాయి. 60-65 రోజులలో ఆకుపచ్చని కాయలతో కోతకు సిద్ధంగా వుండే రకం.

**జవహార్ మటర్-4 (జె.యమ్.-4):** మొక్కలు పొడవుగా, కాయలు మధ్యస్థంగా వుంటాయి. గింజలు ఆకుపచ్చగా, పెద్దవిగా, ముడతలు కలిగి ఉంటాయి. దిగుబడి ఎకరాకు 24 క్వింటాళ్ళు.

**హిస్సార్ హరిత్ (సి.హెచ్):** కోతకు 60 రోజులలో సిద్ధమవుతుంది. కాయలు గింజలతో పూర్తిగా నిండి ఉంటాయి. దిగుబడి ఎకరాకు 40 క్వింటాళ్ళు.

**మధ్యకాలిక రకాలు:**

**బోర్నివిల్లీ:** ఋతువు మధ్యలో వేయుటకు అనువైన రకం. ఎక్కువ ఎత్తు పెరగదు. గింజలు ముడతలు కలిగి ఉండి తియ్యగా వుంటాయి. 85 రోజులలో కోతకు వస్తుంది. పచ్చికాయల దిగుబడి ఎకరాకు 40 క్వింటాళ్ళు.

**జవహార్ మటర్-1 (జె.యమ్.-1):** కాయలు పెద్దవిగా ఆకర్షణీయంగా, చివర వంపు కలిగి ఉంటాయి. దిగుబడి ఎకరాకు 48 క్వింటాళ్ళు.

**జవహార్ మటర్-2 (జె.యమ్.-2):** గింజలు పెద్దవిగా, ముడతలు కలిగి ఉంటాయి. దిగుబడి ఎకరాకు 40 క్వింటాళ్ళు.

**ఐ.పి.-3 (పంత్ ఉపహార్):** మధ్యస్థ రకం. కాయలు మధ్యస్థం. ఏడు గింజలు కలిగి ఉంటాయి. ఎకరాకు 100 క్వింటాళ్ళ దిగుబడి నిస్తుంది.

**దీర్ఘకాలిక రకాలు**

**ఎన్.పి.-29:** మొక్కలు ఎత్తుగా ఎదుగుతాయి. ముడతలు పడిన గింజలుగల రకం. 100 రోజులలో కోతకు వస్తుంది.

ఇవి కాక ఆజాద్-పి-1 (మధ్యస్థ), ఆజాద్-పి-3 (స్వల్పకాలిక రకం), ఆజాద్ పి-2 మరియు 3 (బూడిద తెగులును తట్టుకునే రకాలు) రకాలను కూడా సాగుచేసుకొనవచ్చు.

**నేల తయారి:** ఆఖరి దుక్కిలోఎకరాకు 8 టన్నుల చొప్పున బాగా మాగిన పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. అనుకూలంగా బోదెలు, కాలువలు చేయాలి. నేలను సమానంగా మొలక రావడానికి అనుకూలమైన స్థితిలో వుంచాలి.

**విత్తన మోతాదు, విత్తేదూరం:** ఎకరాకు స్వల్పకాలిక రకాలకు 40-48 కిలోలు. మధ్య మరియు దీర్ఘకాలిక రకాలకు 32-36 కిలోల విత్తనం కావాలి. వరుసల మధ్య 30 సెం.మీ. మరియు వరుసల్లో మొక్కకు, మొక్కకు 15 సెం.మీ. ఎడం వుండాలి.

**విత్తే కాలం:** అక్టోబరు 15 నుండి నవంబరు 15 వరకు విత్తుకోవచ్చు.

**విత్తన శుద్ధి:** కిలో విత్తనానికి 1 గ్రా. కార్బండజిమ్ చొప్పున కలిపి విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి.

**ఎరువులు:** ఎకరాకు 10 కిలోల నత్రజని, 28 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌లను విత్తే సమయంలో వేయాలి. భాస్వరం, పొటాష్ ఎరువులు బఠాణీలో నత్రజని స్థాపించే సామర్థ్యాన్ని పెంచుతాయి. మొదటిసారిగా బఠాణీ వేస్తున్నట్లయితే కిలో విత్తనానికి 10 గ్రా. చొప్పున రైజోబియం కల్చరు పట్టించి విత్తుకోవాలి.

**కలుపు నివారణ, అంతరకృషి:** పంటకాల పరిమితిలో 1 నుండి 2 సార్లు గొప్పులు త్రవ్వి, బోదెలు, కాల్వలు సవరించాలి. కలుపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.2 లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 48 గంటలలోపు పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం:** విత్తనం వేసే ముందే నీరు పెట్టడం మంచిది. 10-15 రోజులకు ఒకసారి నీటి తడులను ఇవ్వాలి. పూత, పిందె దశల్లో నీరు తప్పనిసరిగా ఇవ్వాలి.

**సస్యరక్షణ**

**పురుగులు**

**కాయతొలుచు పురుగులు:** ఈ పురుగులు పూతదశలో ఆశించి కాయలోనికి చేరి లోపలి పదార్థాలను తిని నష్టపరుస్తాయి. వీటి నివారణకు పూత దశలో గ్రుడ్లను గమనించిన వెంటనే ప్రొఫెనోఫాస్ 2 మి.లీ., క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**రసం పీల్చు పురుగులు:** ఇవి ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి వేయడం వల్ల పంట పెరుగుదల ఆగిపోతుంది. వీటి నివారణకు ఫాస్ఫామిడాన్ 0.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మలాథియాన్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు**

**కుళ్ళు తెగులు:** ఈ తెగులు సోకిన మొక్కలు మొలకెత్తిన వెంటనే గుంపులు గుంపులుగా చనిపోతాయి. నివారణకు థైరమ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి 3 గ్రా. కలిపి మొదళ్ళు తడిచేటట్లుగా పోయాలి.

**ఆకుమాడు తెగులు:** ఆకులపై ముందుగా మచ్చలు ఏర్పడి, క్రమేపి కలిసి పోయి మాడినట్లుగా కన్పిస్తాయి. నివారణకు మాంకోజెబ్ 3 గ్రా. లేదా కార్బండిజిమ్ + మాంకోజెబ్ కలిపిన మందు 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** ముందుగా ఆకులపై పాలిపోయిన మచ్చలు ఏర్పడి బూడిద వంటి పదార్థం ఆకుల అడుగు భాగాన ఏర్పడుతుంది. నివారణకు నీటిలో కరుగు గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వెర్రి తెగులు మరియు ఎండు తెగులు:** వైరస్‌వల్ల ఆశిస్తుంది. మొక్క పెరుగుదల తగ్గిపోయి, పూత, కాయ ఏర్పడదు. రోగాన్ని తట్టుకొనే రకాలను (ఎర్లీ బాడ్జర్, పూసా విపాషా, జె.యమ్.-1, జె.యమ్.-2) సాగుచేయాలి.

**కోత:** రకాన్ని బట్టి విత్తిన 60-100 రోజులకు మొదటి కోత వస్తుంది. ప్రతి పదిరోజులకు ఒక కోతకోయవచ్చు.

| | | | |
|---|---|---|---|
| **దిగుబడి:** | స్వల్పకాలిక రకాలు | : | 10-16 క్వి. కాయలు / ఎకరాకు |
| | మధ్యకాలిక రకాలు | : | 24-30 క్వి. కాయలు / ఎకరాకు |
| | దీర్ఘకాలిక రకాలు | : | 32-44 క్వి. కాయలు / ఎకరాకు |

బఠాణి సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం,**
అదిలాబాద్ 504001. ఫోన్: 08732-220458.